
సాక్షి అనకాపల్లి

3

ఆదివారం । 15 । జనవరి । 2023



16న బౌద్ధ మేళా

కనుమ రోజున బొజ్జన్నకొండపై నిర్వహించే బౌద్ధ మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విదేశీ బౌద్ధ భిక్షువులు పాల్గొంటారు. ఆరోజు సాయంత్రం తీర్థం జరుగుతుంది.

4లో



టోల్‌గేట్ కిటకిట

నక్కపల్లి: వేంపాడు టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు.. సంక్రాంతికి జనం సొంత ఊళ్లకు పయనం కావడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది.

రేపు స్పందన లేదు

తుమ్మపాల: ఈ నెల 16వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమం ఉండదని డీఆర్వో పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కనుమ పండగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం ఆ రోజు ఉండదన్నారు. వినతులు ఇవ్వడానికి వచ్చేవారు ఈ విషయం గమనించాలని కోరారు.

పల్లె నవ్వింది..

- సంక్రాంతి హడావుడితో కళకళలాడుతున్న గ్రామాలు
- వలస జనం సొంతూళ్లకు రావడంతో సర్వత్రా సందడి
- మంచి దిగుబడితో రైతుల ఇంట కన్నుల 'పంట'

సంక్రాంతి పండగంటే రంగువల్లుల వాకిళ్లు.. అందమైన గొబ్బిళ్లు.. హరిదాసు కీర్తనలు.. ఆనందాల హరివిల్లు.. అనురాగాల పొదరిల్లు....ఊరూ వాడా సందళ్లు. ఎక్కడెక్కడి నుంచో అందరూ స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. పంటలు బాగా పండడంతో ఈ ఏడాది పండగ సంబరాలు అంబరాన్ని అంటేలా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే భోగిమంటల కాంతులు విరజిమ్మాయి. సంక్రాంతి, కనుమ పర్వదినాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడానికి ఊళ్లన్నీ ఉవ్విళ్లూరుతున్నాయి.

సాక్షి, అనకాపల్లి: పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. ఊరూ వాడా సంక్రాంతి శోభతో వెలిగిపోతున్నాయి. పట్టణాల్లో స్థిరపడిన గ్రామీణవాసులు సంక్రాంతికి సొంతూళ్లకు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉద్యోగస్తులు, విద్యార్థులతోపాటు వ్యాపారాల రీత్యా దూరప్రాంతాల్లో స్థిరపడిన వారు గ్రామాల బాట పట్టారు. దేశ విదేశాల్లో ఉన్నా... సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. గ్రామాల్లో ప్రతి ఇల్లూ కుటుంబ సభ్యులతో కళకళలాడుతోంది.

రైతుల మోముల్లో ఆనందం

దేశానికి వెన్నెముక రైతు. అలాంటి అన్నదాతల ఇంట ఈ ఏడాది సంక్రాంతి శోభ తాండవిస్తోంది. సకాలంలో వర్షాలు పడి వాతావరణం అనుకూలించి పంట చేతికొచ్చింది. అనుకున్న దానికన్నా వరి దిగుబడి పెరిగింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం, సంక్రాంతికి ముందే వారి అకౌంట్లలో డబ్బులు పడడంతో రైతు ముఖాల్లో ఆనందం సంతరించుకుంది. గ్రామాలను ఆనుకొని ఉన్న పట్టణాల్లో పండగ సరకులు, కొత్తకొత్త బట్టల కొనుగోళ్లలో వ్యాపారం మరింత జోరందుకుంది. ప్రతి ఇంటిలో పిండివంటలు ఘుమఘుమలాడుతున్నాయి.



రావికమతం మండలం కవగుంట గ్రామంలో భోగి సందడి

సంప్రదాయాలు సజీవం

కాలం ఎంతమారినా తెలుగు సంప్రదాయం సజీవంగానే ఉంది. ఇళ్ల ముందు రంగువల్లుల మధ్య గొబ్బెమ్మలను తంగేడు, గుమ్మడి, ముక్కెర, బంతి, చామంతిలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. నెల రోజులపాటు పెట్టిన గొబ్బెమ్మలను ఎండపెట్టి పిడకలుగా సంక్రాంతి రోజు పొంగళ్లు వండేందుకు ఉపయోగిస్తారు. కొత్త మట్టి పాత్రలో ఇంటికొచ్చిన కొత్త బియ్యంతో బెల్లం వేసి జీడిపప్పు తదితర వాటితో పొంగలి తయారు చేస్తారు. సంక్రాంతి రోజున పితృదేవతలను కొలుస్తారు. గోపూజలతో కనుమ పండగను గ్రామీణులు ఘనంగా నిర్వహిస్తారు. సంక్రాంతి పండగ అంటేనే కోడిపందేలు గుర్తుకు వస్తాయి. హింస, జూదం జోలికి పోకుండా పోలీసులు కట్టడి చేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా పందేలను నిర్వహించడానికి జనం సమాయత్తమవుతున్నారు. నర్సీపట్నం, యలమంచిలి, అనకాపల్లి, మాడుగుల, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో ఈ సందడి ఎక్కువగా ఉంటుంది.



అప్పన్న సన్నిధిలో సంక్రాంతి శోభ

సింహాచలం: సింహగిరిపై శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం అధికారులు ఈ సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు.. సంక్రాంతి సంబరాలను కూడా తనివితీరా తిలకించారు. హరిదాసు, గంగిరెద్దు, కొమ్మదాసరి తదితరుల ప్రదర్శన ఆకట్టుకుంది.



గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్త జనం

కమనీయం.. గోదాదేవి కల్యాణం

- ఉపమాకలో కన్నుల పండువగా గోదా రంగనాథుల కల్యాణం
- పులకించిన భక్తజనం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం భోగి రోజున ఉపమాకలో గోదాదేవి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీరంగనాథుడిని వివాహమాడడం కోసం గోదాదేవి నెల రోజులపాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించింది. ఈ దీక్ష భోగి పండగతో ముగిసింది. స్వామి ఆమె దీక్షకు మెచ్చి వివాహమాడడానికి అంగీకరించినట్లు పురాణ కథనం. ఈ ఘట్టాన్ని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, పి.వి.శేషాచార్యులు స్వామివారి పుష్ప తోటలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం కొండపై మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామివారి ఉత్సవ ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారిని అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఆచారాలు, వైష్ణవ సంప్రదాయం ప్రకారం 30వ పాశురం విన్నపం చేసి, స్వామివారి పుష్పతోటలో గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిష్యత్, రక్షా బంధనం, కల్యాణమండప బలిహరణ, యజ్ఞోపవీతధారణ, రుత్విక్వరుణ (స్వామివారికి అనువైన కన్య కోసం 8 మంది పెద్దలు వెతికే ఘట్టం) జరిపారు. అనంతరం స్వామివారికి పాద ప్రక్షాళన, కన్యాదానం, కట్నాలు, శుభముహూర్తం, మంగళ సూత్రధారణ, ఆశీర్వచనాలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థగోష్టి, ప్రసాద వినియోగంతో గోదాదేవి కల్యాణం ముగించారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేతుడైన స్వామివారిని పుణ్యకోటి వాహనంలోనూ, అమ్మవారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. అర్చక స్వాములు రాజగోపాలాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, ఎన్.సిహెచ్.శ్రీనివాసాచార్యులు, తరిగొండ వేంగమాంబ సాహిత్యపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి, శ్రీనివాస భక్తసమాజం సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



అప్పన్నా.. అందుకోవయ్యా తొలిపంట

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి తొలి పంటలను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పు దినుసులను భక్తి శ్రద్ధలతో స్వామికి అందించారు.

విహార యాత్రలో విషాదం

- తంతడి బీచ్‌లో ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- ఢిల్లీకి చెందిన యువకుడి కోసం గాలింపు

పరవాడ: బీచ్ అందాలను చూసేందుకు వెళ్లిన ఇరు కుటుంబాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తంతడి తీరంలో గల్లంతైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకొంది. వారిలో అనకాపల్లికి చెందిన కడలి లీలా ప్రశాంత్ (30) మృతదేహం లభించగా ఢిల్లీకి చెందిన లక్ష్యవర్మ (14) ఆచూకీ లభ్యం కాలేదు. పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి రాణిగారి పూల తోటకు చెందిన లీలా ప్రశాంత్ కుటుంబానికి ఢిల్లీకి చెందిన రేణుక కుటుంబంతో ఫేస్‌బుక్ ద్వారా కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రేణుక తన చెల్లి కుమారుడైన లక్ష్యవర్మను వెంటబెట్టుకొని రెండు రోజుల క్రితం అనకాపల్లిలో లీలా ప్రశాంత్ ఇంటికి వచ్చారు. లీలాప్రశాంత్ తన తల్లి సూర్యకళ, తండ్రి సత్యనారాయణ, స్నేహితులు రేణుక, ఆమె చెల్లి కుమారుడైన లక్ష్యవర్మలతో కలిసి శనివారం సాయంత్రం అచ్యుతాపురం మండలం తంతడి బీచ్ సందర్శనకు వచ్చారు. లక్ష్యవర్మ, లీలా ప్రశాంత్ నీటిలోకి దిగి స్నానం చేస్తున్నారు. పెద్ద అలలు వచ్చి లక్ష్యవర్మను లోపలికి ఈడ్చుకుపోయాయి. ఆ యువకుడిని కాపాడేయత్నంలో లీలా ప్రశాంత్ కూడా కొట్టుకుపోయాడు. స్థానిక యువకులు కొందరు సముద్రంలో కొట్టుకుపోతున్న లీలా ప్రశాంత్‌ను కాపాడి ఒడ్డుకి చేర్చినా ఫలితం దక్కలేదు. అప్పటికే అతను మృతి చెందాడు. గల్లంతైన లక్ష్యవర్మ జాడ తెలియరాలేదు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు చర్యలకు అవరోధం ఏర్పడింది. లభ్యమైన లీలా ప్రశాంత్ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఇరు కుటుంబాల సభ్యులు తీరం వద్ద బోరున విలపిస్తున్న తీరు స్థానికులను కంట తడిపెట్టించింది. పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వర్రావు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రశాంత్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం





భోగి సంబరాల్లో ...

దేవరాపల్లి మండలం సంజీవపురంలో గ్రామస్తులు, అధికారులతో కలిసి భోగి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. తొలుత భోగి మంట వెలిగించి ఆటపాటలతో సందడి చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి గాజువాక దరి మిందిలోని తన ఇంటి వద్ద భోగి వేడుకలను జరుపుకున్నారు. చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గాజువాకలోని తన ఇంటి వద్ద భోగి మంట వేసి కుటుంబ సభ్యులతో సందడి చేశారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



మహారాణిపేట(విశాఖ దక్షిణ) : వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, ఇతర పోస్టులను కాంట్రాక్టు పద్ధతితోపాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 21లోగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో (రేసవానిపాలెం) అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు శనివారం తెలిపారు. పిడియాట్రిక్స్ (5 పోస్టులు, కేజీహెచ్, డీహెచ్ అనకాపల్లి, డీహెచ్ పాడేరు), స్పెషల్ ఎడ్యుకేటర్ (ఒకపోస్టు, డీహెచ్ అనకాపల్లి), ఫ్రెండ్లీ హెల్త్ కౌన్సెలర్ (6 పోస్టులు, నర్సీపట్నం, యలమంచలి, చోడవరం, పాడేరు, చింతపల్లి, అరకు), ఆస్పత్రి అటెండర్ (ఒక పోస్టు, నర్సీపట్నం), శానిటరీ అటెండర్ (2 పోస్టులు అనకాపల్లి, నర్సీపట్నం), సైక్రియాటిస్టు (ఒక పోస్టు, నర్సీపట్నం), మెడికల్ ఆఫీసర్ (13 పోస్టులు, పాత రేసవానిపాలెం, నమ్మిదొడ్డి, సిద్ధేశ్వరం, చిన ముషిడివాడ, పెందుర్తి, ఆర్‌జీకే హౌసింగ్ కాలనీ, న్యూగాజువాక, గొల్లవీధి (అనకాపల్లి జిల్లా), ములగాడ, రంగిరీజు వీధి, నక్కవానిపాలెం, మారికవలస, సోమలింగపాలెం,) క్లినికల్ సైక్రియాటిస్టు (ఒక పోస్టు, పాడేరు), డెంటల్ టెక్నికల్ (ఒక పోస్టు,పాడేరు), భర్తీ చేస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి విద్యార్హత ధ్రువపత్రాలతోపాటు ఒక జత జిరాక్సు కాపీలను ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు



మృతిచెందిన ఆటో డ్రైవర్ దువ్వాడ మోహన్‌కుమార్



ఘటన స్థలంలో వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై సన్నిబాబు


- ఆటో డ్రైవర్ దుర్మరణం

యలమంచిలి: మండలంలో 16వ నంబరు జాతీయ రహదారిపై రేగుపాలెం కూడలి వద్ద శనివారం ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ దువ్వాడ మోహన్‌కుమార్ దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. తుని నుంచి యలమంచిలి వైపు వస్తున్న ఆటో రేగుపాలెం కూడలి వద్ద యూటర్న్ తీసుండగా, అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోడ్రైవర్ మృతి చెందగా, మరో ప్రయాణికుడు పూడి పైడికొండ గాయపడ్డాడు. మృతుడిది రాంబిల్లి మండలం రజాల గ్రామం అని రూరల్ ఎస్సై సన్నిబాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి మృతి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉడ్‌పేట సాయిప్రియ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సంతోష్(34) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. సంతోష్ అవివాహితుడు. తల్లిదండ్రులు ఇంటిలో లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పూర్తి వివరాల కోసం పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


బౌద్ధ మేళా రేపు



బొజ్జన్నకొండ

- బొజ్జన్నకొండపై ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న విదేశీ బౌద్ధ భిక్షువులు
- అదేరోజు తీర్థానికి పోటెత్తనున్న భక్తులు

అనకాపల్లి టౌన్: కనుమ పండగ రోజు చారిత్రక విశేషాల సమాహారం బొజ్జన్నకొండ వైభవాన్ని కనులారా వీక్షించాలి. జిల్లాతోపాటు రాష్ట్రంలో పేరొందిన బొజ్జన్నకొండ తీర్థాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 16న (సోమవారం) బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బౌద్ధ మేళాతోపాటు మధ్యాహ్నం నుంచి నిర్వహించే తీర్థానికి భారీ ఎత్తున జనం తరలి రానున్నారు. పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ బొజ్జన్న కొండకు పర్యాటక ప్రియులు వస్తున్నప్పటికీ వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు ఇక్కడ పర్యటించారు.



బొజ్జన్నకొండ ముఖద్వారం

చారిత్రక నేపథ్యం...

చారిత్రక అవశేషాలకు తోడు, దేశంలోనే ఒక ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన బొజ్జన్నకొండ అనకాపల్లి మండలం శంకరం రెవెన్యూలో ఉంది. బొజ్జన్నకొండ తీర్థం రోజునే దేశ, విదేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు బౌద్ధమేళా నిర్వహించడంతో ఈ తీర్థానికి మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. బొజ్జన్న కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పలువురు మంత్రులు సైతం హామీ ఇచ్చినా, 1958 నుంచి పురావస్తు చట్టం దీనికి గొడ్డలి పెట్టుగా మారింది. అయినప్పటికీ తీర్థం సందడిని కొనసాగిస్తూనే బౌద్ధమేళా నిర్వహించడం వల్ల కనుమ పండగ నాడు బొజ్జన్నకొండ కళకళలాడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే బొజ్జన్నకొండ, లింగాల కొండల్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పురావస్తు శాఖ నిబంధనలకు విఘాతం కలగకుండా బొజ్జన్నకొండకు విచ్చేసే పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియ మొదలైంది. ఇక్కడకు తరచూ విదేశీయులు వస్తుంటారు. విశాలమైన పార్కు చూపరుల్ని ఆకట్టుకుంటోంది.



లింగాల కొండపై చైత్యాలు

కొండకెళ్లే మార్గం...

బొజ్జన్న కొండకు చేరుకునేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. అనకాపల్లి–సబ్బవరం రహదారిలో శంకరం గ్రామానికి సమీపంలో జంక్షన్ నుంచి చేరుకోవచ్చు. ఏలేరు కాలువను ఆనుకొని తుమ్మపాల నుంచి మరొక రహదారి ఉంది. బొజ్జన్నకొండ తీర్థం రోజున ఈ రెండు మార్గాలు తీర్థ ప్రియులతో జన సంద్రంగా మారుతాయి.



కొండ వద్ద పార్కు

శాంతి ర్యాలీ

కనుమ రోజు (సోమవారం) ఉదయం 9.30 గంటలకు బౌద్ధ పతాకావిష్కరణ చేస్తారు. కొండ ప్రవేశ మార్గం ద్వారా కొండపై ప్రధాన స్థూపం వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య కన్వీనర్ గొంది నవీన్ తెలిపారు.

భూముల రీ సర్వేలో లోపాలను సవరించాలి

- రాష్ట్ర వీఆర్వోల సంఘం గౌరవాధ్యక్షుడు ఈర్లె

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు సర్వేలో లోపాలను సవరించి, ముఖ్యమంత్రి ఆశయం నెరవేరేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వీఆర్వోల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి కోరారు. శనివారం శ్రీరాంపట్నం గ్రామంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. వందల కోట్లు ఖర్చు పెట్టి చేస్తున్న సర్వేలో ముందుగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, దేవదాయ భూములు, గ్రామ కంఠాలు తీసివేసి తరవాత రైతుల జిరాయితీ భూములను సర్వే చేయాలన్నారు. భూముల సర్వేతోపాటు సెటిల్‌మెంట్లు చేయాలన్నారు. సర్వే ప్రారంభంలో ప్రాజెక్ట్ పైలట్‌గా 200 ఎకరాలు సర్వే చేయడానికి 6 నెలలు కాలం తీసుకోగా ఇపుడు పెద్ద గ్రామాల్లో సర్వేను రెండు నెలల్లో పూర్తి చేయాలని పై స్థాయి అధికారులు కింది స్థాయి రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తేవడం తగదన్నారు. దాని వల్ల సక్రమంగా సర్వే పూర్తి కాక ప్రభుత్వ ఆశయం నెరవేరదన్నారు. రైతుల భూములు సర్వే చేసిన రోజే కుటుంబ సభ్యులు, వారసుల పంపకాల భూములకు సరిహద్దులు తేల్చి సర్వే రాళ్లు వేయాలన్నారు. సర్వే చేసే భూముల్లో ముందుగా సర్వే రాళ్లు వేయకపోవడం వల్ల తరవాత భూ సమస్యలు వస్తాయన్నారు. జగనన్న భూ సర్వేకు అదనపు సర్వే సిబ్బందిని కేటాయించకపోవడం వల్ల అధికారులు ఒత్తిడిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఆశయం నెరవేరేలా సర్వే శతశాతం పూర్తయ్యేలా పై అధికారులు కృషి చేయాలన్నారు.

సైకో అయ్యన్న..నోరు అదుపులో పెట్టుకో

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: సైకో అయ్యన్న నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హెచ్చరించారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉనికి చాటుకునేందుకు అయ్యన్నపాత్రుడు ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేస్తున్నాడరన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు చేయలేని పనులు తమ ప్రభుత్వంలో చేసి చూపించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారన్నారు. దీనిని సైతం అయ్యన్నపాత్రుడు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. అయ్యన్నపాత్రుడు శంకుస్థాపనలకు పరిమితం కాగా పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తాను సీఎంను కోరిన వెంటనే రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేశారన్నారు. రెండు నెలల్లో టెండరు ప్రక్రియ పూర్తి చేసి, రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు రుత్తల సర్వం, సర్పంచ్ శానపతి వెంటకరత్నం తదితర్లు పాల్గొన్నారు.

ఆరుగురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

చోడవరం రూరల్: మండలంలోని జన్నవరం కొత్తూరు గ్రామంలో గొలగాని వెంకన్న గారి పాకల వద్ద కోడి పందాలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సమాచారం మేరకు ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో దాడి చేశారన్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లతోపాటు రూ. 1,860 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

లక్కవరం, దామునాపల్లి గ్రామాల్లో 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.8,070 స్వాధీనం చేసుకున్నట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో కలిసి లక్కవరం కిందవీధిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.820 స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం దామునాపల్లి గ్రామ శివారులో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,250 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిపై కేసులను నమోదు చేశామన్నారు.

సంబరాలు లోడింగ్..!



భోగి వేడుకల్లో పిల్లలకు స్వీట్లు పంచుతున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు



విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని భోగి మంట వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బుగిడి నూకఅప్పారావు



నూకాంబిక అమ్మవారికి పిండివంటలతో నైవేద్యం

- పల్లె గూటికి పండగొచ్చింది
- ఊరూవాడా భోగి మంటలు
- సంక్రాంతి వేడుకకు సన్నద్ధం

పాడి పంటలు, భోగి మంటలు, పచ్చ తోరణాలు, ముంగిట ముగ్గులు, కళకళలాడే వాకిళ్లు, కొత్త అల్లుళ్లు, కోడి పందాలు.. ప్రతి ఊరూ.. ప్రతి ఇల్లూ ఆనందాల నెలవే..! హిందూ పండగల్లో అత్యంత ముఖ్యమైన పండగ మకర సంక్రాంతి. మన దేశంలోనే కాక.. ప్రపంచ దేశాల్లో ఉన్న భారతీయులంతా ఘనంగా చేసుకునే పండగ సంక్రాంతి. సంక్రాంతి లేదా సంక్రమణము అంటే.. మారడం అని అర్థం. సూర్యుడు మేషాది ద్వాదశ రాశులందు క్రమంగా పూర్వరాశి నుంచి ఉత్తర రాశిలోకి ప్రవేశించడం సంక్రాంతి. తెలుగువారికి పెద్ద పండగ. ఇప్పటికే పట్టణాలన్నీ పల్లెబాట పట్టాయి. ఇన్నాళ్లూ వెలవెలబోయిన గ్రామాలు.. సంక్రాంతి పండగకు ఊరొచ్చిన జనాలతో సందడిగా మారాయి.

అనకాపల్లిటౌన్/కశింకోట : పెద్దల పండగకు పల్లెలు ముస్తాబయ్యాయి. ఉపాధి కోసం ఊరొదిలిన పల్లె జనం.. తమ సొంత గూళ్లకు చేరుకున్నారు. దీంతో ఊళ్లన్నీ సంబరాల లోడింగ్‌లో.. బిజీ అయ్యాయి. భోగి మంటల వెలుగు తమ జీవితాల్లో కూడా నిరంతరం నిలివాలని కోరుకుంటూ ఊరూరా భోగి మంటలు వేశారు. సంక్రాంతినాడు పితృ దేవతలకు తర్పణాలివ్వడం ఆనవాయితీ. అలా చేస్తే వారు ఏ లోకాన ఉన్నా.. తమను చల్లగా చూస్తారని, దీవిస్తారని నమ్మకం. అందుకే ఏడాదంతా తీరిక లేకున్నా.. పండగ రోజుల్లో మాత్రం తమ సొంత ఊరికి చేరుకోవడానికే ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారు.

- పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో భోగి పర్వదినాన్ని ఉత్సాహంగా జరిపారు. తెల్లవారు జామునే భోగి మంటలు వేశారు. పిల్లలకు భోగిపళ్లు తలపై పెట్టిస్నానం చేయించారు. గవరపాలెం, వేల్పులవీధి, లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, పూడిమడక రోడ్డు, రింగ్‌రోడ్డు, నెయ్యిలవీధి, గాంధీనగరం, లక్ష్మీదేవిపేట, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో యువకులు, స్థానికులు కలిసి భోగి మంటలు వేసి, వేడుకలు నిర్వహించారు.
- ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానందనగర్‌లోని తన స్వగృహం వద్ద ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు భోగి మంట వేశారు. స్వీట్లు పంచిపెట్టారు. హరిదాసును, గోమాతను ఎంపీ దంపతులు పూజించారు.
- విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బుగిడి నూక అప్పారావు గవరపాలెం పార్కు సెంటర్లో భోగి మంట వద్ద ప్లకార్డులతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.
- కశింకోట మండలంలో భోగి పండుగ ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలోని గవరపేట, కస్పావీధి, కనకమహాలక్ష్మి వీధి, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. దాని చుట్టూ చేరి మంట కాగారు. చిన్న పిల్లలకు తమ ఇళ్ల వద్ద సంప్రదాయంగా భోగి పళ్లు పోసి వేడుక చేశారు. మండల గ్రామాల్లో కూడా భోగి మంటలు వేసి ఘనంగా వేడుక చేసుకున్నారు.
- గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి జయవీర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భోగి మంటలను వేశారు. అమ్మవారికి పలు రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, అలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మున్సబువారి తీర్థ మహోత్సవం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఆదివారం బుద్ద అప్పారావునాయుడు 107వ జయంతిని పురస్కరించుకుని మున్సబువారి తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుద్ద నాయుడు, దాడి సన్యాసిరత్నంలు శనివారం తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకూ ఈ ఉత్సవం జరుగుతుందన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహ స్వామి ఊరేగింపు



లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

కశింకోట : స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు శనివారం ఘనంగా జరిగింది. భోగి పండగ పురస్కరించుకుని రథంపై లక్ష్మీ నృసింహస్వామి, మహాలక్ష్మి ఉత్సవ విగ్రహాలను నిలిపి వీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. ఆదివారం సంక్రాంతి సందర్భంగా కూడా స్వామి వార్లను పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెంలో సంక్రాంతి పురస్కరించుకుని ఉగ్గిన గంగునాయుడు సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, అధ్యక్షుడు కలగా సోమేశ్వరరావు, సంఘ చైర్మన్ నాయుడుబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రతిభా పురస్కారాల ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే ఇష్టపడి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ వైద్యుడు కేకేవీ నారాయణరావు అన్నారు. గవరపాలెం గౌరీ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2023 సంక్రాంతి ప్రతిభా పురస్కారాలను శనివారం ఆయన చేతుల మీదుగా ప్రదానం చేశారు. పదో తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 20 మందిని ఎంపిక చేసి, స్కాలర్‌షిప్పులు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భీమరశెట్టి కోటేశ్వరరావు, కార్యదర్శి కొణతాల రాజేంద్రప్రసాద్, కోశాధికారి భీశెట్టి వెంకటకన్నారావు పాల్గొన్నారు.

పేకాడుతూ ముగ్గురు అరెస్ట్

కశింకోట : మండలంలోని బంగారయ్యపేట గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న ముగ్గుర్ని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.1,410 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కమనీయం గోదాదేవి కల్యాణం



విజయరామరాజుపేటలో కల్యాణంలో పాల్గొన్న నర్సింగరావు దంపతులు, సురేష్ దంపతులు



వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవం

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు దేవాలయాల్లో గోదాదేవి కల్యాణం శనివారం జరిగింది. స్థానిక విజయరామరాజుపేట శ్రీకృష్ణ దేవాలయంలో గోదాదేవి కల్యాణాన్ని ప్రముఖ వ్యాపారవేత్త నర్సింగరావు,మహాలక్ష్మి, అల్లు సురేష్, హేమలత దంపతులు ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రేజేటి చక్రవర్తి ఆధ్వర్యంలో ఓబుల్ రెడ్డి దంపతులు గోదాదేవి కల్యాణం నిర్వహించారు. నెయ్యిలవీధి సీతారామ ఆలయంలో గోదాదేవి కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్షుడు కోడూరు త్రినాథరావు పాల్గొన్నారు.

కశింకోట : దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయం వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్కి అవతారంలో స్వామిని అలంకరించి పూజలు చేశారు.

రేపు వీరన్నస్వామి తీర్థం



వీరన్నస్వామి కొలువుదీరిన కోరుకొండ

తుమ్మపాల : తెలుగు పండగలకు కేరాఫ్ సంక్రాంతి. సంక్రాంతి పండగ మొదలు గ్రామాల్లో తీర్థాలు జోరందుకుంటాయి. స్థానిక కోరుకొండ వీరన్నస్వామి తీర్థానికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. అనకాపల్లి మండలంలోని చినమాకవరం గ్రామానికి అత్యంత సమీపంలో పాపయ్యసంతపాలెం రెవెన్యూ పరిధి కోరుకొండపై ఉన్న వీరేశ్వరస్వామినే వీరన్న స్వామిగా స్థానికులు పిలుస్తారు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు(కనుమ) తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. సమీప గ్రామాలైన పాపయ్యసంతపాలెం, చినమాకవరం, పాపయ్యపాలెం, మామిడిపాలెం గ్రామాల పెద్దలు కమిటీగా ఏర్పడి ఈ నెల 15న వీరన్న తీర్థ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కోరుకొండ వీరన్న స్వామిని దర్శించుకోవాలంటే మెట్లు లేని, వాలుగా ఉండే కొండపైకి ఎక్కాల్సిందే. ఉత్సవానికి వచ్చే భక్తుల కోసం అవసరమైన చోట కర్రలను ఏర్పాటు చేశారు. వీటి సాయంతో కొండపైకి చేరాలి. ఈ కొండపై నిత్యం నీరుండే గుంత ఉంది. ఈ నీటిని తాగితే పాపాలు పోతాయని ప్రసిద్ధి. తీర్థం రోజున ప్రసాదాన్ని గుడి ఉత్తర, దక్షిణ దిక్కుల నుంచి గుడి గోపురం మీదుగా విసురుతారు. ఈ ప్రసాదం దొరికిన వారిని అదృష్టవంతులుగా పేర్కొంటారు. గతంలో కొబ్బరి చెక్కల్ని విసిరేవారు. భక్తులకు గాయాలవుతుండటంతో అరటి పండ్లను మాత్రమే అనుమతిస్తున్నారు. తీర్థ మహోత్సవం నాడు స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తారు. సమీపంలో ఉన్న మార్టూరు గ్రామం నుంచి స్వామి వారిని పల్లకీపై ఊరేగిస్తూ.. భజనలు చేస్తారు. చిడతలు, సాముగరిడీలు నిర్వహిస్తారు. వీటిని చూసేందుకు పరిసర గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తారు.

వెదురుపర్తి హైస్కూల్‌కు రామ్‌కో సిమెంట్స్ సాయం



ఎంపీ సత్యవతికి హైస్కూల్లో కల్పించిన అదనపు సదుపాయాల పత్రాలను అందిస్తున్న రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్లో రామ్‌కో సిమెంట్ యాజమాన్యం అదనపు తరగతి గదులు, ఇతర సదుపాయాలను కల్పించడం అభినందనీయమని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ వెంకటసత్యవతిల సూచనల మేరకు పాఠశాలలో తాజాగా అదనపు సదుపాయాలు కల్పించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను శనివారం ఎంపీ సత్యవతిని కలిసి రామ్‌కో సిమెంట్ ప్రతినిధులు సుబ్బారావు, తదితరులు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం నాలుగు తరగతి గదులు, టాయిలెట్లు, హెచ్‌ఎం గది, ప్రహరీ నిర్మించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులతో కాండ్రేగుల శ్రీరామ్

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో సర్వేజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఫోర్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త కాండ్రేగుల శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరగనున్న ఈ పోటీల్లో 15 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గవరపాలెం చర్చ్ ఫాదర్ పండ్రాన తిమోతి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గంటి రవికుమార్, నిర్వాహకులు కోరిబిల్లి హరి, ఆడారి సతీష్, రాజు, శ్రీను, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ నేవల్ శిక్షణకు గవరపాలెం విద్యార్థులు



ఎన్‌సీసీ నేవల్ శిక్షణకు ఎంపికైన గవరపాలెం చిన్నహైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి కాండ్రేగుల జనార్దనరావు తెలిపారు. ఈ స్కూల్‌కు చెందిన 50 మంది విద్యార్థులు ఈ నెల 14 నుంచి 21 వరకూ విశాఖ జిల్లా రఘు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే నేవల్ యూనిట్3(ఎ) శిక్షణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం నేవల్ యూనిట్ ద్వారా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎ.సూర్యనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తీతకు కృషి



బెల్లం రైతులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

కశింకోట : మండలంలోని పంట కాలువల్లో పూడికతీత పనులు జరిగేలా అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో బెల్లం తయారీ రైతుల సమస్యలపై శనివారం ఆయన చర్చించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ప్రస్తావించారు. పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో పంట భూముల్లో నీరు నిలిచి, చెరకు మొదళ్లు కుళ్లిపోయి దిగుబడి తగ్గిపోతోందని వాపోయారు. రత్నాకర్ సానుకూలంగా స్పందించారు.

యువత రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వంద మంది యువకులు రక్తదానం చేశారు. విశాఖలోని ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. శిబిరంలో సినీనటుడు జోగినాయుడు, సంస్థ సభ్యులు ప్రదీప్, సాయికుమార్, డాక్టర్ నాయుడు, మహేష్, ఆనంద్, ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.రవితేజ పాల్గొన్నారు.

అయ్యప్ప మకర జ్యోతి దర్శనం

తుమ్మపాల : స్థానిక శ్రీగౌరీపంచాయతన దేవస్థానంలో అయ్యప్ప మకర జ్యోతి దర్శన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మినారాయణ ప్రారంభించారు. స్వామివారిని వంద తులాల బంగారు ఆభరణాలతో అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. స్వామివారు బంగారు వజ్రకవచ అలంకరణలో ఎంతో ఆకర్షణీయంగా దర్శనమిచ్చారు.

ఘనంగా కృష్ణకుమారి తీర్థ మహోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉమ్మలాడ రహదారిలో స్వర్గీయ బుద్ద కృష్ణకుమారి(పేరంటాలు) తీర్థ మహోత్సవం శనివారం జరిగింది. తెల్లవారు జాము నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట: మండలంలోని జి.భీమవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సూరిశెట్టి చిరంజీవి, కణితి బ్రహ్మాజీ పని మీద కన్నూరుపాలెం వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా జి.భీమవరం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో కింద పడి వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.